


TGTEL/25/A31

నేటి దిక్సూచి
తెలుగు దిన పత్రిక

## తెలంగాణ జిల్లాలు

# హైటెన్షన్ లైన్ల కింద నిర్మాణం..!

### టౌన్ ప్లానింగ్ నోటీసులు బేఖాతరు..?

### విద్యుత్ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు..?

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అంటూ కాలనీవాసుల ఆందోళన



ఎల్బీనగర్, జూలై 3 (నేటి దిక్సూచి ): హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండి పుల్లారెడ్డి గార్డెన్ సమీపంలో హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద ఐరన్ షెడ్ నిర్మాణం కొనసాగుతుండడం స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. విద్యుత్ భద్రతా నిబంధనల ప్రకారం హైటెన్షన్ లైన్ల కింద శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.స్థానికుల ఫిర్యాదుల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ యజమానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ పనులు ఆగకుండా కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.అయితే ఈ వ్యవహారంలో విద్యుత్ శాఖ అధికారుల వైఖరిపై కూడా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద నిర్మాణ పనులు జరుగుతున్న విషయం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందస్తుగా అడ్డుకోవడం అధికారుల బాధ్యత కాదా అని ప్రశ్నిస్తున్నారు.వర్షాకాలంలో హైటెన్షన్ విద్యుత్ లైన్ల పరిసరాల్లో ప్రమాదాల ముప్పు అధికంగా ఉంటుందని, అలాంటి ప్రాంతంలో ఐరన్ షెడ్ నిర్మించి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.టౌన్ ప్లానింగ్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే వెంటనే నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.